
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం : 28.5
కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY



సూర్యాపేట

5 శనివారం 27 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.40 (305.7464)	2,73,762	2,73,762
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.77 (4.14)	9,727	17,000
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.289 (37.3665)	3,01,031	3,09,320

చికెన్ ధరలు	లైవ్ : రూ.138	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.220



స్థానిక ఎన్నికలకు రెడీ

- బీసీ రిజర్వేషన్ల జీవో విడుదలతో అంతటా ఎన్నికల వాతావరణం
- నేడు కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం
- నేటి సాయంత్రానికి స్థానాల వారీగా రిజర్వేషన్ల వెల్లడి!
- నేడో, రేపో ఎన్నికల షెడ్యూల్ వస్తుందనే అంచనా

ఏడాదిన్నర కాలంగా వేర్వేరు కారణాలతో వాయిదాపడుతూ వస్తున్న స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్ గడిచిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పలు కసరత్తుల అనంతరం స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో 9ని విడుదల చేసింది. దీంతో ఎన్నికలకు ప్రధాన అడ్డంకి తొలగింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఇప్పటికే ఉమ్మడి జిల్లాల అధికార యంత్రాంగం సమాయత్తమవగా, శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కలెక్టర్లతో సమావేశం కానున్నారు. ఈ సమావేశం పూర్తయ్యేలోగా జీవో 9 మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించాల్సిన రిజర్వేషన్లను సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో జీవో జారీ చేయనుంది. అదేవిధంగా సమావేశం అనంతరం కలెక్టర్లు శనివారం సాయంత్రానికి జిల్లాలో కేటాయించిన రిజర్వేషన్ల వివరాలను ప్రకటిస్తారని అంచనావేస్తున్నారు. ఈ ప్రక్రియలు ముగిసిన అనంతరం ఏ క్షణమైనా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది.

69 శాతానికి చేరనున్న రిజర్వేషన్లు

బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తూ జీవో విడుదలవడంతో రాష్ట్రంలో స్థాని క సంస్థల్లో రిజర్వేషన్ల కోటా...

మిగతా 7వ పేజీలో..



కాంగ్రెస్‌లో మదర్ డెయిరీ చిచ్చు

మదర్ డెయిరీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో చిచ్చు రేపుతున్నాయి. ఈ ఎన్నికలు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల మధ్య సవాళ్లకు దారితీసింది. రోజురోజుకూ చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు అటు అధిష్ఠానానికి, ఇటు స్థానిక నేతలకు ఇబ్బందికరంగా మారాయి. మదర్ డెయిరీ ఎన్నికల్లో పార్టీకి సంబంధించిన కొంతమంది బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీని బొందపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఘాటైనా వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, ప్రస్తుత మదర్‌డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పరోక్షంగా బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నారని, అపవిత్రమైన, లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారని, ఇది పార్టీకి ద్రోహం, మోసం చేసే వ్యవహారమంటూ ఎమ్మెల్యే సామేల్ ప్రత్యక్షంగా విమర్శలు గుప్పించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు స్థానిక పార్టీ నేతలపై ఎమ్మె ల్యే చేసిన విమర్శలు, ఆరోపణలు స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతల్లో చర్చనీయాంశమయ్యాయి. స్థానిక సంస్థలకు సంబంధించి ప్రభుత్వం ఓ వైపు 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణ యం తీ సుకోగా, మరోవైపుపార్టీ ఎమ్మెల్యేలు, నేతల మధ్య ఈ వివాదాస్పద వ్యాఖ్యలు ఏంటని శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి.

చర్చనీయాంశమైన సామేలు ఆరోపణలు

ఎమ్మెల్యే సామేలు చేసిన ఘాటైన విమర్శలు, ఆరోపణలపై తుంగతుర్తి, ఆలేరు

- సంచలనం సృష్టించిన ఎమ్మెల్యే మందుల సామేలు వ్యాఖ్యలు
- సొంత పార్టీ నేతలపైనే విమర్శలు
- బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతేంటని ప్రశ్నలు
- ప్రభుత్వ విప్ బీర్ల రాజీనామా చేయాలని సవాల్

నేడు డైరెక్టర్ పదవులకు ఎన్నిక

మదర్‌డెయిరీలో డైరెక్టర్ స్థానాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని రెండు జనరల్ స్థానాలు, నకిరేకల్ నియోజకవర్గంలో ఓ మహిళా స్థానం ఉంది. తుంగతుర్తిలో రెండు డైరెక్టర్ పదవులకు ఐదుగురు బరిలో ఉన్నారు. వీరిలో మంచాల ప్రవీణ్‌రెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శీలం వెంకట నర్సింహారెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్, ఉన్నారు. నకిరేకల్ మహిళా స్థానం నుంచి గంట్ల రాధిక, కర్నాటి జయశ్రీ, మోతె పూలమ్మ, సుదగాని విజయ నామినేషన్ దాఖలు చేశారు. అయితే కాంగ్రెస్ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులకే ఓటు వేయాలి తప్ప, బీఆర్ఎస్ బలపరిచిన మోత్కూరు ప్రాంతానికి చెందిన రచ్చ లక్ష్మీనరసింహారెడ్డికి కాంగ్రెస్ పార్టీకి చెందిన పాల సంఘాల చైర్మన్లు ఓటు వేయవద్దని ఎమ్మెల్యే మందుల సామేలు డిమాండ్ చేస్తున్నారు. అయితే తుంగతుర్తి నియోజకవర్గంలో ఉద్దేశ్యపూర్వకంగా పార్టీలోని కొంతమంది లోపాయికారీగా వేరే పార్టీ నుంచి బరిలో దిగిన వారికి మద్దతు తెలియజేస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణుల్లో తీవ్రంగా చర్చ మొదలైంది. తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థితో పొత్తు పెట్టుకునే అవకాశం ఎవరిచ్చారని, ఏఐసీసీ, టీపీసీసీ, ముఖ్యమంత్రి ఆదేశాలు ఉన్నాయా? అని నేరుగా ప్రశ్నించారు. కొంతమంది నేతలు తనను కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.ఈ ఎన్నికల్లో కొంతమంది జిల్లా నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నట్టు వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. తుంగతుర్తి - మిగతా 8వ పేజీలో...

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



జిల్లా వ్యాప్తంగా వైభవంగా దేవీశరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. చిలుకూరులో రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారి మండలపాన్ని అలంకరించారు.

6,8

బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆర్వో, ఏఆర్వోలకు కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలన్నారు. సమష్టికృషితో విధులు నిర్వహించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జడ్పీ సీఈవో అప్పారావు, డీపీవో యాదగిరి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల వివరాలను నమోదు చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల వివరాలను ఈ నెల 30వ తేదీలోపు పీఎంఏవైజీ యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం వెబెక్స్ ద్వారా జిల్లాలోని గృహ నిర్మాణ శాఖధికారులతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ పూర్తయిన ఇళ్ల నిర్మాణంలో పురోగతి తీసుకోవాలన్నారు.

మూసీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలోని మూసీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూసీనదికి ఎగువ భాగం నుంచి పెద్దమొత్తంలో వరద వస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 645 అడుగులు కాగా ప్రస్తుతం 643.77 అడుగులకు చేరిందన్నారు. బ్రిడ్జిలు, కాజ్‌వేల వద్ద ప్రజలు రాకపోకలకు ప్రయత్నించవద్దన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు ఇవ్వాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధానకార్యదర్శి సోమపంగు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నెల నెలా వేతనాలు చెల్లించాలన్నారు. మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ధర్నా అనంతరం వినతిపత్రాన్ని డీపీవో యాదగిరికి అందజేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి, నాగరాజు, ముత్తయ్య, నర్సయ్య, రేణుక, ఉష, గురువయ్య, భిక్షం, దుర్గయ్య, వెంకటేష్, వెంకటరామయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీపడేది లేదు: మంత్రి ఉత్తమ్

గరిడేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధిలో పడేదిలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కల్మలచెర్వు, గానుగబండ, గడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి రూ.17 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం కల్మలచెర్వులో ఆయన మాట్లాడుతూ తనకు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమన్నారు. నాణ్యతతో రోడ్లు నిర్మించాలన్నారు. గత ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేయడంతో పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వాటిస్థానంలో కొత్తగా రహదారులు నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో సంబంధిత అధికారులపర్యవేక్షణ ఉండాలన్నారు. రహదారుల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రహదారులు సరైన విధంగా ఉన్నప్పుడు అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. మండలంలో వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న రహదారుల వివరాలను వెల్లడించారు. ఇదిలా ఉండగా గానుగబండలో అభివృద్ధి వివరాలు వెల్లడిస్తున్న సమయంలో మైక్ సక్రమంగా పని చేయకపోవడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, పెండెం శ్రీనివాస్‌గౌడ్, పయిడిమర్రి రంగనాథ్, కటకం రమేష్, విజయ సీతారాంరెడ్డి, గుండు రామాంజిగౌడ్, షేక్ చాంద్‌మియా, పరమేష్, బాల్దూరి సందీప్, కడప దేవదానం, కృష్ణప్రసాద్, సత్యనారా యణ, ముత్యాలు, యోహాన్ పాల్గొన్నారు.



కల్మలచెర్వులో పలురోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రహదారుల కోసం రూ.20.3 కోట్లు

పాలకవీడు : ఎత్తిపోతల పథకాలు పూర్తయితే పాలకవీడు మండలం సస్యశ్యామలం అవుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అలింగాపరం నుంచి రాఘవాపురం వరకు రూ.కోటితో నిర్మించే రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా పాలకవీడు మండలంలో రూ.20.3 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. బెట్టితండా, జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాలతో 12041 ఎకరాలకు సాగునీరందుతుందని, తద్వారా మండలం సస్యశ్యామలం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు భూక్యా గోపాల్, మోతీలాల్, సుబ్బారావు, సప్పిడి నాగిరెడ్డి, నర్సింహారావు, మధునాయక్, సుబ్బుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లను అభివృద్ధి చేస్తా

నేరేడుచర్ల : నేరేడుచర్ల మునిసిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో రూ.41.25 లక్షలతో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించి, మాట్లాడారు. మౌలిక వసతుల కోసం రూ.15 కోట్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ రమాదేవి, కమిషనర్ అశోక్‌రెడ్డి, ఏఈ స్వాతి, కొణతం చిన వెంకటరెడ్డి, బెల్లంకొండ విజయలక్ష్మీనర్సింహారావు, నూకల సందీప్‌రెడ్డి, తాళ్ల సురేష్‌రెడ్డి, బచ్చలకూరి ప్రకాష్, అలక సరిత, మోతీలాల్, గోపాల్ పాల్గొన్నారు.

దుర్గమ్మదయతో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

హుజూర్‌నగర్ రూరల్ : కనకదుర్గమ్మ దయతో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని సాయిబాబా థియేటర్ రోడ్డులో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మవారి విగ్రహానికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు.

కార్యక్రమంలో తన్నీరు మల్లికార్జున్‌రావు, సెగ్యం శ్రీనివాసు, కృష్ణ, చిరుమామిళ్ల సుధీర్, యరగాని శ్రీనివాసు, అమర్నాథ్‌రెడ్డి, హరిబాబు, నాగన్నగౌడ్, కుంట సైదులు, శివరామ్‌యాదవ్, కోటేశ్వరరావు, సంజీవరావు, సురేష్, దూపాటి శ్రీను, స్రవంతి, రాజ్యలక్ష్మీ, రాజేశ్వరి, వెంకటలక్ష్మీ, ఆంజనేయులు, ప్రసాద్, పెద్ద బ్బాయి, పల్లపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం నేటి యువతకు స్ఫూర్తి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఐలమ్మ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనాటి విషమ పరిస్థితుల్లో వెనుకబాటు వర్గాల వారికి న్యాయం జరగాలనే కసితో ముందుకు సాగి ఐలమ్మ పోరాటం చేశారని కొనియాడారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో భాగంగా అన్యాయానికి, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, వివిధ శాఖల అధికారులు నర్సింహ, అశోక్, యాదగిరి, శ్రీనివాసనాయక్, శంకర్, సుదర్శన్‌రెడ్డి, దున్న శ్యాం, అన్నెపర్తి పద్మ, సైదులు, సత్యనారాయణ పిళ్లై, చల్లమల్ల నర్సింహ పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

త్యాగశీలి ఐలమ్మ : ఎస్పీ

సూర్యాపేటక్రైం : రైతాంగ ఉద్యమానికి ఊపిరిపోసి తన ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప త్యాగశీలి చాకలి ఐలమ్మ అని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఎస్‌బీఐ రామారావు, ఆర్ఎస్ఐలు అశోక్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయాల్లో నేర్చుకోవాల్సింది చాలా ఉందని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతుగా ఎస్పీ నర్సింహ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రూ.10 వేలు అందజేశారు.

గడువులోగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ సీతారామారావు

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 26, (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ లక్ష్యాన్ని నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాలోని రైస్‌మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్ పూర్తి చేయడానికి ప్రభుత్వం నవంబరు 12నచివరి తేదీగా నిర్దేశించిందన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రతీ మిల్లర్ తప్పనిసరిగా బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ డీఎం రాము, ఏఎస్‌వో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు

హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జికి పదోన్నతి



హుజూర్‌నగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్‌లోని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి రాధాకృష్ణచౌహాన్‌కు పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం సీనియర్ జడ్జిగా బదిలీపై వచ్చిన ఆయనకు అదనపు జిల్లా న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో న్యాయవాదుల సహకారం మరువలేనిదన్నారు. మెగా లోక్‌అదాలత్‌లో ఎన్నో కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.

పోలీస్‌శాఖపై నమ్మకం కలిగేలా సేవలందించాలి : ఎస్పీ



స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం కలిగేలా సేవలందించాలని ఎస్పీ నర్సింహ అన్నారు. సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. విధుల నిర్వహణపై సిబ్బందికి స్పష్టత వచ్చేలా ప్రతిరోజు ఉదయం రూల్‌కాల్ పరేడ్ నిర్వహించాలన్నారు. కేసుల నమోదు, కేసు ల దర్యాప్తు పెండింగ్ లో లేకుండా చూడాలన్నారు. పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలు, అ నుమానాస్పద ప్రదేశాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించడంతో పాటు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండల్, మహేంద్రనాథ్,శివతేజ, సురేష్ తదితరులు ఉన్నారు.

మొదటి రోజు మద్యం దుకాణానికి ఒక దరఖాస్తు

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో మద్యం దుకాణాలకు మొదటిరోజు ఒక దరఖాస్తు వచ్చినట్లు ఈఎస్ లక్ష్మానాయక్ ఒక ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. కోదాడ పరిధిలోని నల్లబండగూడెం మద్యం దుకాణానికి ఒక దరఖాస్తు వచ్చిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కలెక్టరేట్‌లోని ఈఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే...

కరెన్సీ నోట్లతో విశేషాలంకరణ

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రీతికరమైన శుక్రవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. దుర్గాదేవి మండపాల్లో, అమ్మవారి ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అలంకరణలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. రూ.లక్షల విలువైన కరెన్సీ నోట్లతో మండపాన్ని, అమ్మవారిని అలంకరించారు. పలుచోట్ల అన్నదానాలు చేపట్టారు.



మఠంపల్లిలో జైదుర్గాభవానీ కమిటీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల కరెన్సీతో అలంకరణ



చింతలపాలెంలో కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ



వేములపల్లి మండల కేంద్రంలో మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారి అలంకరణ



యాదగిరిగుట్టపై ఉన్న శివాలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



దేవరకొండ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి చెంత ఉంచిన కరెన్సీ కట్టలు

ఇరుకైన రహదారితో అవస్థలు

» ఇరుకుగా హుజూర్‌నగర్-దాచేపల్లి రహదారి » నిత్యం రద్దీతో తరుచూ ప్రమాదాలు
» మట్టపల్లి వద్ద వంతెనతో పెరిగిన రాకపోకలు



అదుపు తప్పి పడిపోయిన లారీ(ఫైల్)

ఉభయ తెలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న హుజూర్‌నగర్-దాచేపల్లి రహదారి ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనాల రద్దీ పెరగడం, రహదారి ఇరుకుగా మారడంతో వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు ఇరురాష్ట్రాల మధ్య రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిని విస్తరిస్తే ప్రమాదాలు నివారించవచ్చంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నుంచి మఠంపల్లి మీదుగా మట్టపల్లి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా దాచేపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మించారు. ఈ రహదారిని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారికి అనుసంధానించారు. ఈ రహదారిపై తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద కృష్ణానదిపై రూ.50కోట్లతో హైలెవల్ వంతెనను నిర్మించారు. అయితే రాష్ట్రంలో పేరొందిన సిమెంట్ పరిశ్రమలతో పాటు మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఉండటంతో నిత్యంపెద్దసంఖ్యలో లారీలు, కార్లు, టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రహదారి ఇరుకుగా మారడం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

విస్తరిస్తేనే ప్రమాదాల నివారణ

తెలుగు రాష్ట్రాల మధ్య సంబంధబాంధవ్యాలు ఎక్కువగా ఉండటంతో పాటు పత్తి, మిరప పంటల వాణిజ్యవ్యాపార సంబంధాలతో గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ప్రజల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. దీంతో వాహనాల రద్దీ ఏర్పడి తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో స్థానిక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రభుత్వం హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి క్షేత్రం వరకు ఉన్న 25 కిలోమీటర్ల రోడ్డును రద్దీకి తగ్గట్టు నాలుగులేన్లుగా విస్తరిస్తే ప్రమాదాలు నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నాలుగు లేన్లుగా మార్చాలి



తెలుగు రాష్ట్రాలను కలుపుతూ కృష్ణానదిపై మట్టపల్లి వద్ద నిర్మించిన వంతెనతో రాకపోకలు భారీగా పెరిగాయి. డబుల్ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి నాలుగులేన్లుగా రహదారిని విస్తరించేందుకు చర్యలు చేపట్టాలి.

- మాలోతు సక్యనాయక్, మండల వాసి

ప్రభుత్వాలు దృష్టి సారించాలి



హుజూర్‌నగర్ నుంచి దాచేపల్లి వరకు ఉన్న డబుల్ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించాలి.నిత్యం రద్దీగా ఉండే ఈ అంత రాష్ట్ర రహదారిపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. మట్టపల్లి వద్ద వంతెన నిర్మాణంతో రాకపోకలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు రోడ్డును విస్తరింపజేయాలి.

- ధీరావత్ నవీన్‌నాయక్

సామాజిక న్యాయం కాంగ్రెస్ మూల సిద్ధాంతం

హుజూర్‌నగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కాంగ్రెస్ మూల సిద్ధాంతమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో ఆమె విగ్రహాన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రాజకీయ రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగ అవకాశాలు అమలు చేస్తామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వంలో తాను చైర్మన్‌గా ఉన్న కమిటీ ద్వారా రాష్ట్రంలోని 3.70కోట్ల మందిని ఇంటింటి సర్వే నిర్వహించి బీసీ కులగణన చేసిందన్నారు. రాష్ట్రంలో 56శాతం బీసీలు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ రిజర్వేషన్లు 42శాతం అమలుచేసి శాసనసభలో బిల్లు ఆమోదించి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటి చెప్పిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన ఘనత కాంగ్రెస్‌నన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఏవిధంగా చట్టం చేశామో అలాగే బీసీలకు చట్టం చేసి ముందుకు వెళ్తున్నామన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల్లో అట్టడుగు వర్గాలకు పోటీ చేసేందుకు అవకాశం కల్పించామన్నారు. జనరల్ స్థానంలో బీసీల్లోని రజకులకు మండల స్థాయి పదవులు అందించామన్నారు.



బూరుగడ్డలో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి, మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బీసీలకు కాంగ్రెస్ వెన్నుదన్ను

కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలని, రాజకీయంగా కాకుండా సామాజికంగా బీసీలకు కాంగ్రెస్ వెన్నుదన్నుగా ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. రాజకీయంగా బీసీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు సాధించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టి ఆ యూనివర్సిటీ ప్రాధాన్యాన్ని పెంచి మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ఐలమ్మ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తన్నీరు మల్లికార్జున్‌రావు, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, యరగాని నాగన్నగౌడ్, దొంగరి వెంకటేశ్వర్లు, సాముల శివారెడ్డి, దొంతగాని శ్రీనివాసు, హరిబాబు చౌదరి, అమర్నాథ్‌రెడ్డి, ఈడ్పుగంటి సుబ్బారావు, అజీజ్‌పాషా, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, చలసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సూర్యాపేట జనరల్ ఆస్పత్రితో ఇద్దరి సస్పెన్షన్

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

భానుపురి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ వద్ద డబ్బులు వసూలు చేశారని నలుగురు వ్యక్తులు వారం రోజుల కిందట ఫిర్యాదు చేశారు. ఆ మేరకు విచారణ నిమిత్తం ఇతర విభాగంలోని ముగ్గురు ఉద్యోగులతో కూడిన త్రిమెన్ కమిటీని నాలుగురోజుల కిందట నియమించారు. ఫిర్యాదుదారులు అందించిన ఆధారాలతో త్రిమెన్ కమిటీ విచారణ చేసింది. విచారణలో ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ నెహ్రూ నాయక్, సీనియర్ అసిస్టెంట్ వేణు డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సస్పెండ్ చేశారని సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నిధుల దుర్వినియోగంతో..

ఆరోగ్యశ్రీ నిధులను దుర్వినియోగం చేశారని, ఇతర అకౌంట్లకు డబ్బులను మళ్లించినట్లు ఆరు నెలల కిందట వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టారు. ఆధారాలను నిర్ధారించుకుని సీనియర్ అసిస్టెంట్ వేణు, ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉమేష్ నిధులను దుర్వినియోగం చేశారని విచారణ కమిటీ నివేదిక కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు అందించారు. దీంతో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉమేష్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కావడంతో విధుల నుంచి తొలగించారు. సీనియర్ అసిస్టెంట్ వేణును సస్పెండ్ చేశారని సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతలు ఉంటే ఉద్యోగం వస్తుందే తప్ప డబ్బులు పెట్టి ఉద్యోగం కొనుగోలు చేస్తే చట్టపరమైన నేరం అవుతుందన్నారు. డబ్బులు తీసుకున్న వారిని ఇచ్చిన వారిని సైతం నేరస్థులుగా పరిగణిస్తారన్నారు.

రైతులను మోసగిస్తే కఠినచర్యలు

మోత్కూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూకంలో గాని, ధాన్యం కొనుగోలులో గాని మోసగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని యాదాద్రిభువనగిరి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజారాణి హెచ్చరించారు. మోత్కూరు మండలం అనాజీపురం గ్రామంలో ఏర్పాటుచేసిన వేబ్రిడ్జి తూకంలో తేడా ఉండటంతో రైతులు వేబ్రిడ్జి యజమాని, ధాన్యం వ్యాపారిని నిలదీసి కార్యాలయానికి గదికి తాళం వేశారు. ఈ సంఘటన ఈ నెల 26న వేబ్రిడ్జిలో తప్పుడు తూకాలతో మోసం' శీర్షికన పత్రికలు వెలుగులోకి తెచ్చాయి. ఈ సంఘటనపై పౌరసరఫరాల అధికారులు స్పందించి శుక్రవారం అనాజిపురం వేబ్రిడ్జిని పరిశీలించారు. రైతులను విచారించారు. తూనికల, కొలతల జిల్లా అధికారి అందుబాటులో లేకపోవడంతో ఆయన వచ్చి పరిశీలించే వరకు వేబ్రిడ్జిపై తూకాలు నిలిపివేయాలని ఆదేశించారు. వేబ్రిడ్జి కాంటా వద్ద లభ్యమైన పౌరసరఫరాల ఖాళీ బస్తాలను వారు పరిశీలించారు. బస్తాలు గత సీజన్‌లో అక్కడ నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించినవిగా భావిస్తున్నారు. బస్తాల విషయం డీసీవోకు తెలియపర్చుతామని పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పారు. ఏఎస్‌వో సురేష్‌రెడ్డి, ఆర్ఐలు బాలమని, నాగమణి ఆమె వెంట ఉన్నారు.



అనాజిపురంలో వేబ్రిడ్జి వద్ద పౌరసరఫరాల శాఖ ఖాళీ బస్తాలను స్వాధీనం చేసుకున్న డీఎస్‌వో రోజారాణి

ఢిల్లీ నుంచి నగరానికి అక్రమంగా విదేశీ మద్యం

● 44 బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు ● నిందితుల్లో నల్లగొండ వాసులు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ నుంచి హైదరాబాద్ నగరానికి అక్రమంగా దేశీయ మద్యంతో పాటు విదేశీ మద్యాన్ని సరఫరా చేసి గుట్టుగా విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 44 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రకాశంబజార్‌కు చెందిన ఏలూరు రవి, వాడ్గర్ శ్రీధర్, వెంకటేశ్వరరావు ముఠాగా ఏర్పడ్డారు. ఢిల్లీలో మద్యాన్ని కొనుగోలు చేసి రైలులో గుట్టుగా హైదరాబాద్‌కు రవాణా చేస్తారు. నగరంలో విక్రయించి వచ్చిన సొమ్మును సమానంగా పంచుకుంటారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు సీఐ సౌజన్య బృందం శుక్రవారం రైల్వేస్టేషన్ సమీపంలో మాటువేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మొదట వారి వద్ద 20 మద్యం బాటిళ్లు సీజ్ చేశారు. అనంతరం వారిని విచారించి సుల్తాన్ బజార్‌లో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన మరో 24 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 44 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను నారాయణగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. చాకచక్యంగా విదేశీ మద్యం బాటిళ్లను పట్టుకున్న సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, ఈఎస్ పంచాక్షరి, ఏఈఎస్ శ్రీనివాసరావు అభినందించారు.




విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు, చిత్రంలో నిందితులు

పాతకక్షల నేపథ్యంలో వ్యక్తి

దారుణహత్య

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాకేంద్రంలో శుక్రవారం రాత్రి పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన సారగండ్ల శివ(28)ను పట్టణానికి చెందిన ముగ్గురు కుసుమవారి గూడెం వద్ద వైన్స్ ఎదురుగా ఉన్న దుకాణంలో కత్తులు, గొడ్డళ్లతో దారుణంగా నరికి చంపారు. దుకాణంలో మందు తాగేందుకు శివ వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకుంది. శివతో గతంలో పాతకక్షల ఉన్న వారే చంపారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. శివకు భార్య అఖిల, కుమార్తె విజయశ్రీ, కుమారుడు రిషి ఉన్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎస్ఐ బాలునాయక్ పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఏఎస్పీ మౌనిక విచారణ



విచారణ చేస్తున్న ఏఎస్పీ మౌనిక

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహం నేపథ్యంలో జరిగిన దాడి కేసుకు సంబంధించి శుక్రవారం నల్లగొండ జిల్లా దేవరకొండ ఏఎస్పీ మౌనిక విచారణ చేపట్టారు. మండలంలోని దుగ్యాల గ్రామానికి చెందిన ఎర్ర కళమ్మ కుమారుడు చంద్రబాబు అదే గ్రామానికి చెందిన యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. అయితే వివాహాన్ని జీర్ణించుకోలేని యువతి తండ్రి కంభంపాటి అంజయ్య, కుటుంబసభ్యులు ఈనెల 23న తన ఇంటిపై దాడి చేసి తల్లి కళమ్మను గాయపరిచారని చంద్రబాబు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో ఏఎస్పీ మౌనిక శుక్రవారం దుగ్యాలలోని నేరస్థలంలో విచారణ చేపట్టారు. ఆమె వెంట సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ నర్సింహులు ఉన్నారు.

హత్యకేసులో ఇద్దరు నిందితులకు యావజ్జీవ శిక్ష

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువకుడి హత్య కేసులో నిందితులిద్దరికి యావజ్జీవ జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా మూడో అదనపు, కుటుంబ న్యాయస్థాన జడ్జి డి.దుర్గాప్రసాద్ తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2014 ఏప్రిల్ 25వ తేదీన అనుముల వంశీకృష్ణ(23), అతని స్నేహితులు ఉజ్వల్, శరత్, వంశీ, శ్రీకాంత్ గ్రీన్‌హిల్స్ కాలనీలో మద్యంతో దావత్ చేసుకున్నారు. ఆ సమయంలో నల్లపరాజు రాజేష్(మెంటల్ రాజేష్), పెరిక సాయితేజ(టిల్లు)లు అక్కడకు వచ్చి వారితో గొడవ పడ్డారు. ఆ సమయంలో స్నేహితులు ప్రతిఘటించడంతో అక్కడినుంచి వెళ్లిపోయారు. అదే రోజు సాయంత్రం వంశీకృష్ణ నల్లగొండలోని శివాజీనగర్ చౌరస్తాలో ఒక్కడే ఉండగా, రాజేష్, సాయితేజలు కత్తి, రాయితో విచక్షణారహితంగా దాడి చేయటంతో వంశీకృష్ణ తీవ్రగాయాలతో స్పృహకోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వంశీకృష్ణ తండ్రి రమేష్ కుమారుడి వద్దకు వచ్చి ఏం జరిగిందో తెలుసుకుని రాజేష్, సాయితేజలపై నల్లగొండ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. వంశీకృష్ణ పరిస్థితి విషమించడంతో నల్లగొండ జేఎఫ్‌సీఎం జడ్జి ఆసుపత్రికి వచ్చి మరణ వాంగ్మూలాన్ని (డయింగ్ డిక్లరేషన్) నమోదుచేశారు. అదే రోజు రాత్రి 11.35 గంటలకు వంశీకృష్ణ మృతి చెందాడు. దీంతో హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు నిందితులపై ఐపీసీ సెక్షన్ 302, ఆర్మ్స్ యాక్ట్ 27 (2), క్రిమినల్ అమెండ్‌మెంట్ యాక్ట్ -1932 సెక్షన్ 71(1) ప్రకారం కేసు విచారణ చేపట్టారు. సరైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించడంతో పాటు, బాధితుడి మరణ వాంగ్మూలం ఆధారంగా శుక్రవారం నల్లగొండ జిల్లా మూడో అదనపు, కుటుంబ న్యాయస్థాన జడ్జి దుర్గాప్రసాద్ నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుఫున ఫ్యామిలీ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.జవహర్‌లాల్ వాదించారు. అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులైన సీఐలు రవీందర్, మనోహర్‌రెడ్డి, జె.రవీందర్, ఎస్ఐ క్రాంతికుమార్, ప్రస్తుత డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ రాఘవరావు, ఎస్ఐ సైదులు, సీడీవో బి.సుమన్, లైజన్ అధికారులు నరేందర్, మల్లికార్జున్‌ను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

రాజేష్ పలు కేసుల్లో నిందితుడు


నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన నల్లపరాజు రాజేష్ (మెంటల్ రాజేష్), పాత నేరస్థుడని, అతనిపై రౌడీషీట్ ఉందని పోలీసులు పేర్కొన్నారు. 2011లో హత్య కేసు, 2012లో హత్య కేసు, మరో రెండు హత్యాయత్నం కేసులు, 2103లో రెండు హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు పలు ఇతర కేసుల్లో ఇతను ప్రధాన నిందితుడిగా ఉన్నాడని, మొత్తం 18 కేసుల్లో రాజేష్ నిందితుడని పోలీసులు వివరించారు. ఇంటర్ చదివిన రాజేష్ తర్వాత జులాయిగా తిరుగుతూ నేర ప్రవృత్తికి అలవాడు పడ్డాడని పేర్కొన్నారు. మద్యం మత్తులో విచక్షణ మరిచి ప్రవర్తించే క్రమంలో నేరాలకు పాల్పడిన ఘటనలు సైతం గతంలో నమోదైనట్లు పోలీసులు తెలిపారు

అసాంఘిక చర్యల అడ్డుకట్టకు పోలీసుల దృష్టి

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

శ్రీలక్ష్మీనృసింహస్వామి కొలువైన ప్రసిద్ధ క్షేత్రం యాదగిరిగుట్ట ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకట్టవేసేందుకు పోలీసులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద ఆలయం కావడంతో నిత్యం భక్తుల రద్దీ ఉంటోంది. దీనిని ఆసరాగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీస్‌శాఖ పెద్దఎత్తున చర్యలు చేపట్టబోతోంది. ఇందులో రాజకీయ పార్టీలను, యువతను భాగస్వామ్యం చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 20న బాలికలపై లైంగికదాడి ఘటనలో లాడ్జీని సీజ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో 2018లో స్థానిక పోలీసులు ప్రైవేట్ లాడ్జీలతో పాటుగా వేశ్యాగృహాలపై దాడులు చేయడంతో పాటు వాటిని సీజ్ చేసి అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన కు కృషి చేశారు. అయితే స్తబ్ధుగా ఉన్న అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే నిర్వాహకులు కొంతకాలంగా చాపకింద నీరులా వారి కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఈ నెల 20న హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు, అల్వాల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులను యాదగిరిగుట్టకు తీసుకువచ్చి, ఓ లాడ్జీలో లైంగిక దాడికి పాల్పడ్డారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకున్నా లాడ్జీ నిర్వాహకులు గదిని అద్దెకు ఇవ్వడం, ఆ రాత్రంతా వారు అక్కడే ఉండటం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే ఇటీవలి కాలంలో పలు ప్రాంతాల్లోని లాడ్జీలపై దాడులు చేసి సీజ్ చేశారు. పలు లాడ్జీ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా కార్డెన్ సెర్చ్ వంటి చర్యలు చేపట్టారు. ఇదిలాఉండగా పోలీసులకు సహకరించేందుకు అఖిలపక్షనాయకులు సైతం సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా స్థానిక యువత కూడా పోలీసులకు అండగా ఉండటానికి సమాయత్తమవుతున్నారు.

అసాంఘిక చర్యలను ప్రోత్సహిస్తే ఉక్కుపాదమే



రాష్ట్రంలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించినా, వాటిని ప్రోత్సహించే వారిపై ఉక్కుపాదం మోపుతాం. పట్టణంలోని లాడ్జీలు, గృహాలపై పోలీసులు మెరుపుదాడులు నిర్వహించి, తప్పు జరిగితే క్రిమినల్ కేసులతో పాటు జైలుకు పంపుతాం. లాడ్జీల యజమానులు తప్పకుండా ప్రభుత్వ నియమాలు పాటించకుంటే చర్యలు తప్పవు.అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారు ఆ పనులకు స్వస్తి పలకాలి, లేకుంటే సీతాయాక్ట్ కింద కఠినంగా శిక్షిస్తాం.

- శ్రీనివాస్‌నాయుడు, ఏసీపీ, యాదగిరిగుట్ట

చెర్వుగట్టుకు వెళ్లివస్తామంటూ వెళ్లి..

తల్లీకుమారుడు ఆత్మహత్య

యాదగిరిగుట్ట రూరల్, భువనగిరి రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక, అనారోగ్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్న తల్లీకుమారుడు చెర్వుగట్టుకు వెళ్లొస్తామని వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఉదంతం ఆలస్యంగా శుక్రవారం వెలుగుచూసింది. సీఐ భాస్కర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యాదగిరిగుట్ట పట్టణ అంగడిబజార్‌కు చెందిన కైరంకొండ లలిత(56)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు, పెద్దకుమారుడు సంతోష్ వివాహం కాగా రెండో కుమారుడు కైరంకొండ రామకృష్ణ(35)కు పెళ్లికాలేదు. అతడు మూర్ఛరోగంతో బాధపడుతుండేవాడు. లలితకు ఇటీవల గుండెఆపరేషన్ జరిగింది. దీంతో అనారోగ్యం ఓవైపు, ఆర్థిక ఇబ్బందులతో తరచూ ఇబ్బందులు పడుతుండేవారు. చెర్వుగట్టుకు వెళ్లివస్తే ఆరోగ్యం బాగుపడుతుందన్న నమ్మకంతో ఈ నెల 20 శనివారం తల్లి లలిత, కుమారుడు రామకృష్ణను తీసుకుని బయలుదేరింది. తిరిగి వెళ్లిన వారు మూడు రోజులైనా ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పెద్ద కుమారుడు కైరంకొండ సంతోష్ ఈ నెల 23న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.





లలిత, రామకృష్ణ(ఫైల్‌ఫొటోలు)

రాయిగిరి చెరువులో మృతదేహాల గుర్తింపు

భువనగిరి శివారులోని రాయిగిరి చెరువులో గుర్తుతెలియని రెండు మృతదేహాలను శుక్రవారం గుర్తించారు. బతుకమ్మ పండుగ ఏర్పాటులో భాగంగా రాయిగిరి చెరువు వద్ద భువనగిరి మునిసిపాలిటీకి చెందిన శానిటేషన్ కార్మికుడు కూరెళ్ల యాదగిరి చెరువు పరిసరాలను పరిశీలిస్తుండగా ఆడ, మగ మృతదేహాలు కన్పించాయి. వెంటనే భువనగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ చేరుకొని మృతదేహాలను వెలికితీశారు. విచారణలో వారం రోజుల కిందట ఆచూకీ లేకుండా పోయిన యాదగిరిగుట్టకు చెందిన లలిత, రామకృష్ణలుగా పోలీసులు గుర్తించారు. తల్లీ కుమారుడు కలిసి ఆత్మహత్యకు పాల్పడటంతో పట్టణంలో విషాదచాయలు అలముకున్నాయి.

కృష్ణపట్టె భూముల పట్టాల్లో వీడని చిక్కుముడులు

● 2019 రెవెన్యూ భూ రికార్డుల ప్రక్షాళనలోనే వెలుగులోకి అక్రమాలు
● 3వేల ఎకరాల బోగస్ పట్టాలు రద్దుచేసిన ప్రభుత్వం



నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం చింతలపాలెంలో సర్వే మ్యాప్‌లను పరిశీలిస్తున్న రెవెన్యూశాఖ అధికారులు(ఫైల్)

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతమైన నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం కృష్ణపట్టె ప్రాంత భూముల పట్టాల వ్యవహారంలో చిక్కుముడి వీడటం లేదు. దశాబ్దాలుగా కృష్ణపట్టె ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ, అటవీ భూములు విస్తారంగా ఉండడంతోపాటు ఆ భూములపై ఎన్నో ఏళ్లుగా అక్రమార్కుల కన్ను పడింది. మండలంలో పలు భూ సమస్యలు ఉండడంతో ఈ ఏడాది ప్రారంభంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తిరుమలగిరి(సాగర్)ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. పలు సంక్లిష్ట భూ సమస్యలు గుర్తించేందుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ఖాస్తుకబ్జాలో ఉన్న అర్హులైన రైతులను గుర్తించేందుకు ఆరు రెవెన్యూ బృందాలను నియమించి గత ఆరు నెలలకు పైగా సమగ్ర భూ సర్వేను నిర్వహించారు.

తాజా సర్వేలో వెలుగులోకి లీలలు

భూ సర్వే చేస్తున్న క్రమంలో పలు అంశాలు వెలుగుచూశాయి. ప్రధానంగా చింతలపాలెం, నెల్లికల్, తిమ్మాయిపాలెం, జమ్మనకోట తదితర రెవెన్యూ శివార్లలో భూములు లేకున్నా సేద్యం చేయకుండానే 'ధరణి' ద్వారా దొడ్డిదారిన పట్టాదారు పాస్ పుస్తకాలను పొందిన 3069మంది అక్రమార్కులను గుర్తించి వారి పేర్లలో ఉన్న సుమారు 3వేల ఎకరాల భూమిపై హక్కులను రద్దు చేశారు. ఈ విధంగా అక్రమార్కులు 2021 నుంచి 2024 వరకు పలు దఫాలుగా రైతుబంధు, రైతుబీమాతోపాటు ప్రభుత్వ పథకాల ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఇటీవల సచివాలయంలో బట్టబయలు చేసింది.

రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కాలంలోనే..

2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 'ధరణి'ని అమలుచేసే క్రమంలో రెవెన్యూ భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టింది. అప్పట్లోనే గత ప్రభుత్వాల హయాంలో కృష్ణపట్టె ప్రాంతంలో జరిగిన అక్రమాలు, భూవివాదాలను గుర్తించి 4వేల ఎకరాలకు పైగా అక్రమ పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ అయిన అంశాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'భూమి బోగస్' శీర్షికన 2017 సంవత్సరం నవంబరు నెలలో కథనం ప్రచురించింది. దీంతో కృష్ణపట్టె ప్రాంతంలోని రికార్డులను పరిశీలించిన రెవెన్యూ అధికారులు విస్తుపోయే అంశాలను గుర్తించారు. అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, జేసీ నారాయణరెడ్డి, చింతలపాలెం, నెల్లికల్లు, తిమ్మాయిపాలెం, జమ్మనకోట తదితర రెవెన్యూ శివార్లలో వాస్తవ భూమి విస్తీర్ణంకంటే దాదాపు రెట్టింపు భూమి పాస్ పుస్తకాల్లో రెవెన్యూ అధికారిక ఆన్‌లైన్‌లోనూ నమోదైందని గుర్తించారు.

కృష్ణపట్టెలో మొత్తం 23వేల ఎకరాలు

తిరుమలగిరి(సాగర్) మండలంలో మొత్తం 23వేల ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు ఉన్నాయి. వీటిలో 12వేల ఎకరాలు ప్రభుత్వ భూములు కాగా, 8వేల ఎకరాలు సాగుకు యోగ్యమైనవాటిగా గుర్తించారు. వీటిలో నాలుగు వేల ఎకరాలకు పట్టాలు ఇవ్వగా, 4వేల ఎకరాలు సేద్యం చేసుకునేందుకు అనుకూలంగా లేకుండా గుట్టలతో ఉన్నాయి. మిగిలిన నాలుగు వేల ఎకరాలకు పట్టాలు ఇవ్వాల్సి ఉంది. అయితే సేద్యానికి అనుకూలం కాని గుట్టలుగా ఉన్న నాలుగు వేల ఎకరాల భూముల్లో అక్రమార్కులు తమ పేరిట పట్టాలు చేయించుకున్నారు. 2017లోనే ఈ అక్రమం వెలుగుచూడగా, పార్ట్-బీలో నమోదుచేసి రీసర్వేకు అధికారులు నిర్ణయించారు. 2021 వరకు భూ సర్వే చేశారు.

కృష్ణపట్టెలో 23వేల ఎకరాల భూమి

తిరుమలగిరి(సాగర్) మండలంలో మొత్తం 23 వేల ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు ఉన్నాయి. వీటిలో 12వేల ఎకరాలు ప్రభుత్వ భూములు కాగా, 8వేల ఎకరాలు సాగుకు యోగ్యమైనవాటిగా గుర్తించారు. వీటిలో నాలుగు వేల ఎకరాలకు పట్టాలు ఇవ్వగా, 4వేల ఎకరాలు సేద్యం చేసుకునేందుకు అనుకూలంగా లేకుండా గుట్టలతో ఉన్నాయి. మిగిలిన 4వేల ఎకరాలకు పట్టాలు ఇవ్వాల్సి ఉంది.

పలు దఫాలుగా కొనసాగిన.. భూ సర్వే

గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పదంగా పార్ట్-బీలో ఉన్న భూములను అప్పటి జిల్లా యంత్రాంగం భూ సర్వేను పలు దఫాలుగా నిర్వహిస్తూ ఏళ్ల తరబడి కొనసాగించింది. 2021లో సాగర్ ఉప ఎన్నిక వచ్చిన క్రమంలో ఈ ప్రాంత రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకునే ప్రయత్నం చేసింది. అందుకు అనుగుణంగా అప్పటికే సర్వే పూర్తయిన రైతులను ధరణిలోకి తెచ్చేందుకు పట్టాదారు పాస్‌పుస్తకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ఎన్నికలకు ముందు రైతులకు అందజేశారు. అక్రమార్కులు దొడ్డిదారిన ధరణిలో నమోదై పట్టాదారు పాస్ పుస్తకాలు పొందినట్లు ఆరోపణలున్నాయి. ఆ విధంగా అ క్రమంగా పాస్ పుస్తకాలు పొందిన వారిని ఇటీవలి రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు ద్వారా గుర్తించి తొలగించారు.

పీటముడి వీడని కాందిశీకుల భూ సమస్య

చింతలపాలెం, తిమ్మాయిపాలెం రెవెన్యూ శివార్లలో గల ఏడు సర్వే నెంబర్లలో సుమారు 2,800 ఎకరాల కాందిశీకుల భూములను నాయకుని తండా, సపావత్‌తండా, చింతలపాలెం, తిమ్మాయిపాలెం, చెన్నాయిపాలెం గ్రామాల రైతులు ఎన్నో ఏళ్లుగా సేద్యం చేసుకుంటున్నారు. అయితే వీరికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ప్రభుత్వ భూములుగా తాత్కాలికంగా గుర్తించి సేద్యం చేసుకున్న వారికి ప్రభుత్వపరంగా అన్ని పథకాలు వర్తించేలా చేశారు. కానీ 2021లో పార్ట్-బీలో ఈ భూములు నమోదుకావడంతో ధరణిలో ఈ భూముల వివరాలు చేర్చలేదు. ఎంతోకాలంగా అక్కడి రైతులు పలు పార్టీల ప్రజాప్రతినిధులను, నాయకులను తమ భూములకు హక్కులు కల్పించే అంశంపై నిలదీస్తున్నారు. అయితే ఈ అంశం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో ఉండడంతో ఈ భూములకు ఎలా హక్కులను కల్పించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, సీసీఎల్ఏ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే ఈ భూములకు ప్రభుత్వం శాశ్వత హక్కులు కల్పిస్తుందని దాని వల్ల ప్రయోజనం చేకూరుతుందని ఈ ప్రాంతానికి సంబంధం లేని పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు, పలు పార్టీల నాయకులు, పలువురు అధికారులు పెద్ద ఎత్తున భూములను కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈవిధంగా సుమారు 500 ఎకరాలకు పైగా కాందిశీకుల భూములు చేతులు మారాయని సమాచారం.

త్వరలోనే పేదలకు 4వేల ఎకరాల పంపిణీ

రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు ద్వారా ఖాస్తుకబ్జాలో ఉంటూ సేద్యం చేసుకుంటున్న అర్హులైన పేద రైతులను రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. దీంతో మండలంలోని 4,219 మంది రైతులకు 4,037 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరంగా చేస్తోంది. ఇప్పటికే 90శాతం మంది రైతులకు ఈకేవైసీని పూర్తి చేసింది. వచ్చే కొద్ది రోజుల్లోనే నాగార్జునసాగర్ నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఈ ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని కసరత్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించే దిశగా

ఎంతో కాలంగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. ప్రతీ రైతుకు భూమిపై హక్కు కల్పించే దిశగా పైలట్ ప్రాజెక్ట్‌లో చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగానే నాలుగువేల ఎకరాలకు అసైన్‌మెంట్ పట్టాలు త్వరలోనే ఇవ్వనున్నాం. అలాగే సాగర్ ముంపువాసుల, కాందిశీకుల భూములను సేద్యం చేస్తున్న రైతులకు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం పలు మార్గాలను పరిశీలిస్తోంది.

అనిల్, తహసీల్దార్, తిరుమలగిరి(సాగర్)

భూభారతి ఎఫ్‌టీఎస్‌లకు పండుగే

● కాంట్రాక్టు ఉద్యోగులుగా ఆపరేటర్లు ● దసరా కానుకగా వేతనాల పెంపు



మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎఫ్‌టీఎస్‌లు

ధరణి ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఎఫ్‌టీఎస్ (ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్) ఏజెన్సీ ఉద్యోగులను ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించింది. దీనికితోడు జీతాలు పెంచడంతో వేతన జీవుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ధరణి ఆపరేటర్లను ప్రభుత్వం తెలంగాణ భూభారతి ఎఫ్‌టీఎస్‌లు టీజీటీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించడంతో నిరంతరం కష్టపడుతున్నందుకు ప్రభుత్వం సముచిత గౌరవాన్ని కల్పించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

ఎఫ్‌టీఎస్‌లకు గతంలో ఏజెన్సీ టెరాసిస్ ద్వారా ఆపరేటర్లకు వేతనాలు అందేవి. టెరాసిస్ కాంట్రాక్టు పూర్తి కాగానే దానిని రద్దుచేస్తూ ధరణి ఆపరేటర్లను తెలంగాణ ప్రభుత్వ టెక్నికల్ సర్వీసెస్‌కు అటాచ్‌చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ నిర్వహణకు 2018 మే 23న రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒకరిని చొప్పున 584 మంది ఎఫ్‌టీఎస్, వారికితోడు 31 జిల్లాల్లో జిల్లా కోఆర్డినేటర్లతో కలిపి 713ని నియమించేందుకు ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎల్అండ్ఎఫ్ఎస్) అనే కంపెనీ గతంలో టెరాసిస్ కీ అవకాశం కల్పించింది. కొంతకాలం తర్వాత టెరాసిస్ ఉద్యోగుల నిర్వహణ పారాడిగమ్ ఐటీ కంపెనీకీ అప్పగించింది. నల్లగొండ జిల్లాలో 36, సూర్యాపేట జిల్లాలో 26, యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 మంది ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 81మంది ధరణి ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. టెరాసిస్ కాంట్రాక్టు గడువు ముగియడంతో ఉద్యోగుల బాధ్యతను ప్రభుత్వం చేపట్టింది. దీంతో జీవో 63 ప్రకారం వేతనాలు పెరగడమే కాకుండా నెలనెల జీతాలు అందుతాయన్న ఆశతో ఉన్న ఉద్యోగులు గత ఏడాదిగా జీతాలు విడుదల చేయమని కూడా ప్రభుత్వాన్ని కోరలేదని అంటున్నారు. ఎఫ్‌టీఎస్‌లకు రూ.12వేలు ఉన్న నెల జీతాన్ని రూ.28,148కి పెంచుతూ ప్రభుత్వం సెప్టెంబరు 18న నిర్ణయం తీసుకుంది. సెప్టెంబరు 25న ఉత్తర్వులు జారీచేసింది.

పండుగకోసం నెల జీతం మంజూరు చేసిన కలెక్టర్

గత జూలై నుంచి ఎఫ్‌టీఎస్‌లు జీతాలు అందక ఇబ్బందులు పడుతుండటంతో ఆర్థిక సమస్యలపై నల్లగొండ కలెక్టర్ దృష్టి సారించారు. ధరణిస్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన భూభారతిలో సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలు శ్రమించిన ఎఫ్‌టీఎస్‌లు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారి అభ్యర్థన మేరకు గత వారం నెల జీతాన్ని మంజూరు చేయడంతో దసరా పండుగకు పస్తులు తప్పాయని ఊపిరి పీల్చుకున్నారు.

ఆశ ఫలించింది



ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి గౌరవించింది. తక్కువ జీతంతో ఆర్థిక అవసరాలు తీరక ఇబ్బందులు పడుతుండగా అనేక మార్లు ప్రభుత్వానికి జీతాలు పెంచమని విన్నవించుకున్నాం. ప్రభుత్వం జీతాలు పెంచుతామని మాట ఇచ్చింది. జీతాలు పెంచి మా ఆశను తీర్చింది.

సిల్వేరు హర్ష, ఎఫ్‌టిఎస్, మాడ్గులపల్లి

వైభవంగా సువర్ణ పుష్పార్చన



ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగావ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.12,45,968 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జీ ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. కాగా, స్వామివారిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదం అందజేశారు. శివాలయంలో ఐదవ రోజు మహాలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

యాదగిరిగుట్ట ఆలయానికి ఎక్సలెన్స్ అవార్డు


యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తెలంగాణ టూరిజం ఎక్సలెన్స్ (ఉత్తమ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రం) అవార్డుకు ఎంపికైనట్లు ఇన్‌చార్జీ ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవంలో భాగంగా శనివారం (నేడు) ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ అవార్డును అందజేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి సీఎంవో కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు వచ్చినట్లు రవినాయక్ వివరించారు. రాష్ట్రంలోనే పెద్దసంఖ్యలో భక్తుల రద్దీ ఉన్న యాదగిరిగుట్ట ఆలయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వటం, ప్రసాదాల తయారీలో నాణ్యతకు ఈ అవార్డు ప్రకటించారని తెలిపారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు మఠంపల్లి విద్యార్థులు

మఠంపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ పట్టణంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో మఠంపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ముల్కపల్లి గురుమూర్తి, మంగళపల్లి మహేష్‌బాబు, దేశభోయిన అనిల్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అక్టోబరు 4నుంచి 7వరకు కర్ణాటక రాష్ట్రంలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీల్లో కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని, ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టులోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ తరపున కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ సతీష్ శుక్రవారం విలేకర్లకు తెలిపారు. సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడంపై పలువురు అభినందించారు.

దసరా పండుగకు వెళ్తూ..

● రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



అభిరామ్ మృతదేహం

భువనగిరి రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు సొంతూరుకు కారులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో కుమారుడు అభిరామ్ (4)అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల గ్రామ శివారులో చోటు చేసుకుంది. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోత్కూరుకు చెందిన చేకూరి నర్సింహ కుమార్తె స్నేహ, ఆమె కుమారుడు అభిరామ్, స్నేహ తల్లి విజయ నిర్మల, స్నేహ సోదరుడు(వరుసకు) నిఖిల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మేడిపల్లి నుంచి దసరా పండుగ కోసం స్వగ్రామమైన మోత్కూరుకు కారులో బయలుదేరారు. మార్గమధ్యలోని భువనగిరి మండలం చందుపట్ల శివారుకు చేరుకోగానే వర్షం అధికంగా కురుస్తుండడంతో కారు సమీప గుంతలోకి దూసుకువెళ్లి చెట్టును ఢీకొట్టింది. దీంతో అభిరామ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న విజయనిర్మల, స్నేహ, నిఖిల్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. కాగా, అభిరామ్ తండ్రి హైదరాబాద్ పాతబస్తీలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

భారీ వర్షంతో పొంగిన వాగులు



వేములపల్లి: శెట్టిపాలెం గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రపరక వాగు

తిరుమలగిరి(సాగర్)/ వేములపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షం ధాటికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారేసరికి పెద్ద ఎత్తున వర్షం కురవడంతో వరదనీరు ప్రధాన రహదారులపైకి చేరి ఏరులై పారింది. దీంతో అల్వాల ఎక్స్ రోడ్డు నుంచి డొక్కలబాయితండా వరకు సుమారు 12గ్రామాలకు వాహనాల రాకపోకలు మధ్యాహ్నం వరకు స్తంభించిపోయాయి. అయితే మెయిన్ రోడ్డుపై నుంచి భారీగా వరద నీరు చేరి ప్రవహిస్తుండడంతో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మండల కేంద్రానికి సమీపంలోని మెయిన్ రోడ్డుపై బర్లబంధం, బడాయిగడ్డ బం ధంపై వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో పోలీసులు పహారా ఉండి వాహనదారులు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు 8గంటల పాటు రోడ్డుపై వరదతాకిడి తగ్గకపోవడంతో మధ్యాహ్నం వరకు వాహనాలు నిలిచిపోయాయి. కాగా వాగుల వెంట ఉన్న సుమారు 200 ఎకరాలకు పైగా వరి పంట వరద నీటిలో మునిగిందని రైతులు పేర్కొన్నారు.

● వేములపల్లి మండలంలోని చిత్రపరక వాగు, పాలేరువాగుకు వరద నీరు భారీగా పోటెత్తడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురయ్యారు. శెట్టిపాలెం శివారులో చిత్రపరక వాగు బ్రిడ్జి వెంట గల లోతట్టు వరి పొలాలు నీట మునిగాయి. కాగా చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకున్నాయి.

మూసీకి వరద.. 9గేట్లు ఎత్తివేత

కేతేపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం రాత్రి వరద పోటెత్తింది. హైదరాబాద్ నగరంతోపాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శుక్రవారం రాత్రి ప్రాజెక్టు 9క్రస్టుగేట్లను ఎత్తి 17వేల క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 6530.23క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో రాత్రి పొద్దుపోయే సరికి మరింత పెరిగి 17వేల క్యూసెక్కులకు చేరింది.

సాగర్ 26 గేట్ల నుంచి కొనసాగుతోన్న నీటి విడుదల

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 587.40 అడుగులుగా (305.7464టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8529 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,251 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్ల నుంచి 2,30,182 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,73,762 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 2,73,762 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మోత్కూరులో కుంగిన మినీ ట్యాంక్‌బండ్ కట్ట



కుంగిన మినీ ట్యాంకు బండ్ కట్ట

మోత్కూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల కేంద్రంలోని మోత్కూరు పెద్దచెరువు, మినీ ట్యాంక్‌బండ్ కట్ట సుమారు 20 అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పు, 3 అడుగుల లోతుతో కుంగింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా కుంగుతూనే ఉంది. కట్ట అక్కడ కుంగడం ఇది రెండో సారి. గతంలో అదే స్థలంలో కట్ట కుంగిపోగా మరమ్మతులు చేశారు. మళ్లీ అక్కడే కుంగింది. మినీ ట్యాంకు బండ్ కట్ట నిర్మించిన నాలుగేళ్లలోనే రెండు సార్లు కుంగడం పనుల నాణ్యతలోని డొల్ల తనం బహిర్గతమవుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. కట్ట కుంగిన సమాచారం తెలుసుకున్న పోలీసులు కట్ట కుంగిన చోట బారికేడ్లు ఏర్పాటు చేశారు.



బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పక్కనుంచి వాహనాలు వెళుతున్నప్పటికీ కుంగుబాటు క్రమంగా పెరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కుంగిన మినీ ట్యాంకు బండ్ కట్టను నీటిపారుదల శాఖ సూర్యాపేట ఎస్ఈ శివధర్మ తేజ, తిరుమలగిరి ఈఈ సత్యనారాయణ ఏఈలు చంద్రశేఖర్, అఖిల్, ఆర్ అండ్ బీ ఏఈ మెంట స్వామి, తహసీల్దార్ పి.జ్యోతి, మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శివధర్మతేజ విలేకరులతో మాట్లాడుతూ కట్టలోంచి కొద్దిగా నీరు లీక్ అవుతున్నదన్నారు. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపడుతామన్నారు. వాహనాలు కుంగి చోటుకు రాకుండా బారి కేడ్లు ఏర్పాటు చేశామని, వాహనదారులు కూడా అక్కడి నుంచి వెళ్లేప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం ముగిసిన తర్వాత చెరువులో నీరు లేనప్పుడు పరిశీలించి శాశ్వత పరిష్కారం కోసం తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



వర్షిత్, సౌమ్య

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నిజాం కాలేజీ మైదానంలో ఈనెల 29వ తేదీ వరకు జరిగే 17వ మినీ సబ్ జూనియర్ బాల, బాలికల జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు నల్లగొండకు జిల్లా కట్టంగూర్ మండలం చెరువు అన్నారం జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న అద్దంకి వర్షిత్, కనగల్ మండలం జి.ఎడవెల్లి జడ్పీ హైస్కూల్‌లో 8వ చదువుతున్న పర్సనబోయిన సౌమ్య ఎంపికయ్యారు. రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మినీ సబ్ జూనియర్ బాల, బాలికల హ్యాండ్ బాల్ ఎంపిక పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులు ఎంపిక కావడంపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కందాల రమ, దొడ్డి విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

'స్థానిక' ఎన్నికలకు సై

(5వ పేజీ తరువాయి)

69 శాతానికి చేరనుంది. ఎస్టీలకు 9శాతం, ఎస్సీలకు 18శాతం, బీసీలకు 42శాతం ఈ ఎన్నికల్లో రిజర్వేషన్ వర్తిస్తుంది. మొత్తం సీట్లలో 50శాతం మహిళలకు రిజర్వ్ చేస్తారు. గత ఎన్నికల కంటే బీసీలకు 19శాతం అధికారికంగా రిజర్వేషన్ పెరగడంతో స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యం పెరగనుంది.

ప్రాథమిక ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారయంత్రాంగం

ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు నిర్వహించేందుకు వీలుగా ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరిషత్ స్థానాలకు ఎంపీటీసీ, పోలింగ్‌స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలు ఇప్పటికే ప్రచురించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. ఎన్నికల సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచారు. అదేవిధంగా వార్డు స్థానాల వారీగా గ్రామపంచాయతీల ఓటర్ల జాబితాలు మొదలు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ పత్రాలు, బాక్సులు సిద్ధమయ్యాయి. పోలీస్ యంత్రాంగం సైతం ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఫలితాల ప్రకటన వరకు అవసరమైన బందోబస్తుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేసి సిద్ధంగా ఉంది.

రిజర్వేషన్లపై తీవ్ర ఉత్కంఠ

జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలతో పాటు గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ స్థానాలు, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లపై ఇప్పటికే తాజా రిజర్వేషన్ శాతాలకు అనుగుణంగా జాబితాలు రూపొందించారు. కలెక్టర్లు ఈ జాబితాలను ఒకటికి, రెండు పర్యాయాలు పరిశీలించి సీల్డ్ కవర్‌లో భద్రపరచి పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదించారు. కమిషనర్ స్థాయిలో జడ్పీ చైర్మన్ స్థానాలకు సైతం రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. శనివారం ఈ జాబితాలు రాష్ట్ర కమిషనర్ వద్ద ఆమోదం పొందిన తక్షణమే గెజిట్ ప్రకటిస్తారు. అనంతరం జిల్లాల్లో వివరాలు వెల్లడిస్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, యాదాద్రిభువనగిరి, సూర్యాపేట జడ్పీ చైర్మన్ పదవులు ఏ వర్గాలకు రిజర్వ్ అయ్యాయనే అంశంపై చర్చ సాగుతోంది. రాష్ట్రంలోనే అతిపెద్దదైన నల్లగొండ జడ్పీ చైర్మన్ పదవి ఏ వర్గానికి రిజర్వ్ అయిందనే అంశంపై రాజకీయవర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఆయా వర్గాలకు రిజర్వ్ అయిందని పేర్కొంటూ సోషల్‌మీడియాలో పోస్టులు వైరల్ అవుతుండగా, అధికారవర్గాలు మాత్రం సమాచారం లేదని ఖండించాయి. శనివారం సాయంత్రానికి రిజర్వేషన్ల వివరాలను కలెక్టర్లు ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది.

బహిరంగ ప్రకటన

ICICI Bank

రిజిస్టర్డ్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి పొందిన ("సౌకర్యం") తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను అక్టోబర్ 08, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్చి వేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం - https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖపేరు: హైదరాబాద్-పంజాగుట్టరెడ్డినగర్	
007562020445	గట్టికొప్పుల వర ప్రసాద్
శాఖపేరు: నల్గొండ	

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
059957000044	ముష్రఫ్ యూనస్
శాఖపేరు: పెద్దపల్లి	
068362015087	రావిచెట్టి కుమార్

తేది:27.09.2025
ప్రదేశం : హైదరాబాద్, నల్గొండ, పెద్దపల్లి

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

CLASSIFIEDS

SITUATION VACANT

★ Wanted Mathematics, English and Science Teachers. Good Pay. Damaracharla. 8008000361 AJH-3068

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)
210/- Only
Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 8885995946

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన టూల్ కిట్ల పంపిణీ

నేరేడుచర్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నేరేడుచర్లలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకొని, వృత్తులకు శిక్షణ తీసుకున్న వారికి టూల్‌కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి ఆధ్వర్యంలో వెన్నం సురేష్‌నాయుడు, మందుగుల శ్రవణ్‌కుమార్, సూరోజు సైదాచారికి కిట్లు అందజేశారు. కార్యక్రమంలో బాల వెంకటేశ్వర్లు, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, గంధం శావయ్య, తాళ్ల నరేందర్‌రెడ్డి, పగిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేశ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని ఆర్‌ఎస్‌ఎస్ నల్లగొండ విభాగ్ ప్రచారక్ కాచం సత్యనారాయణ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నెమ్మికల్ లో నిర్వహించిన శతాబ్ది ఉత్సవంలో ఆయన మాట్లాడారు. దేశానికి సేవ చేయాలంటే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో దేవరకొండ సుందర్, పగిడోజు పరిపూర్ణచారి, కుంచం అశోక్, మనోహర్, శివాజీ పాల్గొన్నారు.

వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 26,(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులు, యువతులను వేధింపులకు గురైతే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూర్యాపేట షీటీమ్ ఎస్ఐ నీలిమ అన్నారు. షీటీమ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థినులు విద్య పట్ల శ్రద్ధ వహించి చదువుకోవాలన్నారు. సైబర్ మోసలు, ర్యాగింగ్, మాదకద్రవ్యాల వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఎక్కడైనా ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే షీటీమ్ నంబరు 8712686056కు తెలపాలన్నారు. సమావేశంలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మేళ్లచెర్వు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను ఆరోపించారు. స్థానిక పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం శ్రీను మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు కార్మికుల పక్షాన సీఐటీయూ రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సమస్యలపై ఎంపీడీవో ఖాజా హజ్గర్ అలీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వట్టెపు సైదులు, వెంకన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆనంద్, కొండలు, ఉప్పలమ్మ, కుమారి, భూలక్ష్మి , చంద్రయ్య పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

తుంగతుర్తి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ నాగ వెంకట్ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని బండ రామారం జడ్పీటీహెచ్‌ఎస్‌లో శుక్రవారం పాఠశాల, కెనరా బ్యాంకు పరిసరాలను శుభ్రం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని అందరూ విజయవం తం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెనరా సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



తుంగతుర్తి : తూర్పుగూడెంలో పశువులకు మందులు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటి చైర్మన్ గిరిధర్ రెడ్డి

తుంగతుర్తి /నూతనకల్/మద్దిరాల సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి సూచించారు. తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో తుంగతుర్తి మండలం తూర్పుగూడెం నూతనకల్ మండలం మిర్యాల, మద్దిరాల మండలం చందుపట్ల గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువులను ఎదకు రావడానికి మందులు వాడాలని చూపించారు. పశువులకు వచ్చే గర్భాశయ వ్యాధుల గురించి డాక్టర్ వెంకన్న వివరించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తుంగతుర్తి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, డాక్టర్ రవి ప్రసాద్, నరేష్, సిబ్బంది రాజశేఖర్, రవి, గోపాలమిత్రలు పాల్గొన్నారు. మిర్యాలలో వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, మార్కెట్ కార్యదర్శి సురేష్, దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీను, ఇరుగు కిరణ్, వెంకన్న, మద్దిరాలలో పశువైద్యాధికారులు భాస్కర్, శంకర్, సుస్మిత, నాయకులు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తీకుల సుధాకర్‌రెడ్డి, అమృతమల్లు, కొమ్ము వెంకన్న, కొమ్ము అంజయ్య, మామిడి వెంకటయ్య, పరాల లింగయ్య పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

గరిడేపల్లి,సెప్టెంబరు 26ఆంధ్రజ్యోతి): మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం మహిళల వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహిళలకు ఏమైనా రుగ్మతలు ఉంటే ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని అన్ని రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్వహించే అన్ని కార్యక్రమాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వ్యాక్సిన్ రిజిష్టర్‌ను ఎప్పటికప్పుడు సక్రమంగా ని ర్వహించాని ఆయన అన్నారు. కార్యక్రమంలో గైనకాజిస్ట్ డాక్టర్ శ్రావణి, మండల వైద్యాధికారి వి.నరేష్, సూపర్‌వైజర్ అంజయ్య, వెంకటరమణ, స్టాఫ్‌నర్స్‌లు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ మార్చేది యువకులే ..

● విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య

కోదాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశ భవిష్యత్ మార్చే శక్తి యువకులే ఉంటుందని విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబడి నాగయ్య అన్నారు. కోదాడ పట్టణంలోని లాల్‌బంగ్లాలో పీవైఎల్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థ నిర్ణయాలతో, దేశంలో రోజురోజుకు పేదరికం పెరుగుతుందన్నారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని యువకులను మోసం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగ భృతి, ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించకుండా కల్లబొల్లి మాటలతో పబ్బం గడుపుతున్నాడన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు మోకాళ్ళ రమేష్, కోలా లక్ష్మీనారాయణ, కోశాధికారి ధరావత్ రవి, రమేష్, సత్యం, కుమార్, రవి, నాగయ్య, చారి, చైతన్య, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● తుంగతుర్తి :జడ్పీ సీఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బచ్చు రాఘవేంద్రరావు తండ్రి తిరుమలరావు ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ రాఘవేంద్రరావును పరామర్శించారు. అనంతరం తిరుమలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

● హుజూర్‌నగర్ రూరల్ : హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురం లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, యువకులు ఫిర్యాదు చేశారు. రూ.20 లక్షలతో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను నాణ్యత లేకుండా పనులు చేస్తున్నారని వెల్లడించారు. మిషన్ భగీరథ ట్యాంక్ లీకేజీ అవుతుందని, దాని స్థానంలో మ రో ట్యాంక్ నిర్మించాలన్నారు. 8, 9 వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి ఉత్తమ్ తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

● నాగారం : నాగారం ఎస్ఐ ఎస్కే యాకుబ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కార్యలయంలో డీసీఆర్‌బీ వింగ్‌లో విధులు నిర్వహిస్తున్న యాకుబ్‌ను నాగారం ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న ఐలయ్య ఎస్పీ కారాలయానికి ఆటాచ్ చేస్తూ ఎస్పీ నరసింహ ఉత్తర్వులు జారీ చేశారు.

● మద్దిరాల : ఉపాధిహామీ పనులు పారదర్శకంగా చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ అప్పారావు సూచించారు. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 15 గ్రామపంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. సుమారు రూ.5.85 కోట్ల పనులను సమీక్షించి అక్రమాలకు జరిగిన రూ.1.33 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ శిరీష, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, పీఆర్ ఏఈ కళ్యాణ్, ఎస్ఆర్పీ శ్రీకాంత్, ఏపీవో జి.వెంకన్న పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్: మునిసిపల్ కార్మికులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శ్రీనివాసరెడ్డి కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు వివిధ శాఖల బ్యాంక్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రమాద బీమా పత్రాలను అందజేశారు.

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

● ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి ● జిల్లా వ్యాప్తంగా ఆమె విగ్రహానికి, చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు, అధికారులు



తిరుమలగిరి మండలకేంద్రంలో చాకలి ఐలమ్మ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడటౌన్ సెప్టెంబరు26, (ఆంధ్రజ్యోతి): : తెలం గాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ భావితరాలకు స్ఫూర్తిదాయకం అని కోదాడ ఆర్డీవో సూర్య నారాయణ అన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతి సందర్భంగా కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఆమె విగ్రహానికి పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లుట్ల శ్రీనివాస్ పట్టణ ప్రముఖులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ చూపిన తెగువ మహిళా లోకానికి మేలుకొలుపు అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పారా సీతయ్య, సత్తిబాబు, ఎర్నేనిబాబు, నూనె సులోచన, పాలూరి సత్యనారాయణ, చింతాబాబు మాదిగ, సట్టు నాగేశ్వరరావు, పిల్లుట్ల కృష్ణ య్య, ఎల్లయ్య, కోటయ్య పాల్గొన్నారు.



కోదాడ ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, నాయకులు

● సూర్యాపేటఅర్బన్ : వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి దాయకమని సూర్యాపేట మునిసిపల్ డీఈ సత్యారావు అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటం వద్ద పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఆర్‌వో కళ్యాణి, నాగయ్య, మాధవి, సంగీత, మాధురి, రాజురెడ్డి, గౌసుద్దీన్, ప్రసాద్, మనోజ్, యాదగిరి పాల్గొన్నారు.

● తిరుమలగిరి : మునిసిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ని వా ళులర్పించారు. క్రాస్‌రోడ్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటం వద్ద పూల మాల వేసి నివాళులర్పించారు, కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, కమిషనర్ మునావర్ అలీ, కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు నరేష్, మాజీ ఎంపీపీ సతీష్, పులిమామిడి సోమయ్య, భిక్షం, నరసింహ, కొత్తగట్టు మల్లయ్య, కందుకూరి సోమన్న పాల్గొన్నారు.

● నేరేడుచర్ల : స్థానిక ప్రధాన కూడలి వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బొడ్డుపల్లి సుందరయ్య, రాపోలు నవీన్, చిలకరాజు శ్రీను, నాగేందర్, వెంకట్, శ్రీనివాస్, శోభ, ఉపేందర్, భరత్, అజయ్ పాల్గొన్నారు.

● మఠంపల్లి :మండలంలోని పెదవీడు గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ కరీం, శ్రీనివాస్, రజక సం ఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గి సైదులు, దుగ్గి రంగయ్య, నల్లగంతుల సోమశేఖర్ పాల్గొన్నారు.

● చిలుకూరు :ఆచార్యులగూడెలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు పారేల్లి మహేష్, మైలార్‌శెట్టి ఎల్లమందయ్య, కార్యదర్శి రామారావు, ఆలోచన ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

● మునగాల : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం వెంకటేశ్వరరావు, టి యాదగిరి, వెంకన్న, టి శివ, మంగయ్య, బుచ్చిబాబు, పవన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



సూర్యాపేట : సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ యాదయ్య

సూర్యాపేటఅర్బన్, కోదాడటౌన్, హుజూర్‌నగర్, సెప్టెంబరు 26, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు పెరుమాళ్ల యాదయ్య, నారు రమణారెడ్డి, గుంటిపల్లి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోదాడ కేఆర్ఆర్, హుజూర్‌నగర్ ప్రభుత్వ కళాశాలల్లో నిర్వహించిన శుక్రవారం పేరెంట్స్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఇంటర్‌లో విద్యార్థులు తెలిసి తెలియకుండా తప్పులు చేస్తుంటారని వారికి అన్ని విషయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు.ఇంటర్‌లో విద్యార్థులు చెడు మార్గాలకు అలవాటు పడితే వారి భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. కళాశాలల్లో విద్యార్థుల హాజరు నమోదును ఫేస్ రికగ్నైజేషన్ పద్ధతిలో నమోదు చేస్తున్నామని, 70 శాతం హాజరు ఉంటే నే వార్షిక పరీక్షలకు అనుమతి ఉంటుందన్నారు. ప్రతి పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి తల్లిదండ్రులు హాజరై సలహాలు, సూచనలు చేయాలన్నారు. సమావేశంలో అధ్యాపకులు వీడీఎస్ ప్రసాద్, చిరంజీవి, గోపమణి, గుర్వయ్య, సైదులు, రమేష్, లలిత, నవీన్, జ్యోతి, లక్ష్మయ్య, ప్రభాకర్‌రెడ్డి, సతీష్, చంద్రశేఖర్, చైతన్య, రవికుమార్ , కోదాడ సమావేశంలో వేముల వెంకటేశ్వర్లు, వంగపల్లి పద్మ, గీత, మమత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కె. శ్రీలక్ష్మి, కళాశాల అకాడమీ ఇన్‌చార్జి ఆర్. పిచ్చిరెడ్డి, జి. యాదగిరి, వి. బల భీమరావు, ఆర్. రమేష్, పి.రాజేష్, ఎం. రత్నకుమారి, ఈ. నరసింహారెడ్డి, జి. రవి కిరణ్, కె.సతీష్ హుజూర్‌నగర్‌లో బ్రహ్మచారి, శ్రీనివాసరెడ్డి, నర్సింహారావు, రాజు, నాగల్‌మీరా, రమేష్, రమణారెడ్డి, రవి, శోభారాణి, ఉపేంద్ర, మహేష్, తేజ, సూరారెడ్డి, జ్యోతి, రామ్మూర్తి పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి



గుడిబండలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడ రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక వసతులు కల్పించి ప్రజ ల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేస్తున్నానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండ గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడిబండ గ్రామంతో తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రతిఒక్కరితో కుటుంబ అనుబంధం ఉందన్నారు. గ్రామంలో ఏ అభివృద్ధి పనులు కావాలన్నా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



ఆత్మకూరు(ఎస్)లో బారులు తీరిన మహిళలు

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మండలానికి వారానికి రెండు, మూడు లారీలు వస్తున్నా రైతులకు సరిపోను యూరియా బస్తాలు అందడం లేదు. దీంతో యూరియా కోసం పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద శుక్రవారం వ్యవసాయాధికారులు టోకెన్ల పంపిణీ చేస్తామని ముందస్తు సమాచారం ఇచ్చారు. దీంతో గురువారం రాత్రి నుంచి పీఏసీఎస్ కేంద్రం వద్ద రైతులు పడిగాపులు పడ్డారు. మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి యూరియా కోసం రైతులు వేలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజామునకే సుమారుగా ఐదు వేల మంది పైగా రైతులు పీఏసీఎస్ కేంద్రానికి చేరుకున్నారు. టోకెన్ల కోసం రైతులు ఒక్కసారిగా ఎగబడటంతో కొంది సేపు అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. టోకెన్లు లభించని రైతులు నిరాశతో వెనుదిరిగిపోయారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



క్రిబ్‌కో వార్షికోత్సవంలో పాల్గొన్న కోదాడ మండల పీఏసీఎస్ చైర్మన్లు

కోదాడ రూరల్, సెప్టెంబరు2 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరత లేకుండా సరఫరా చేయాలని కోదాడ మండలంలోని పీఏసీఎస్ చైర్మన్లు నం బూరి సూర్యం, డేగ బాబు, బజ్జూరు వెంకటరెడ్డి క్రిబ్‌కో ఎండీ ఎస్‌ఎస్. యాదవ్, చైర్మన్ సుధాకర్ చౌదరిని కలిసి విన్నవించుకున్నారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన క్రిబ్‌కో వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మండలానికియూరియాను పెద్దమొత్తంలో సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరినట్లు ఎ శుక్రవారం వారు స్థానిక విలేకరులకు తెలిపారు.

తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలి



హుజూర్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హుజూర్‌నగర్‌రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ పట్టణంలోని సాయిబాబా థియేటర్ రోడ్డులోని ఓ షాపింగ్ మాల్ సెంటర్‌లో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మకు ప్రత్యేకంగా పూజలు చేసిన అనంతరం ఆట, పాటలతో అలరించారు. అనంతరం మహి ళలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు సామాజిక కార్యకర్తలు సెగ్యెం శ్రీనివాసు, చిరుమామిళ్ల సుధీర్ మాట్లాడుతూ తెలంగాణ సంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు ప్రతీక అన్నారు. కార్యక్రమంలో సెగ్యెం స్రవంతి, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, జయమ్మ, శోభ, విద్య, సత్యావతి, పద్మ, సీతమ్మ, శ్రీనివాసు, కోటేశ్వరరావు, సంజీవరావు, సురేష్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి అలంకరణలో దుర్గమ్మ



తిరుమలగిరిలో అమ్మవారికి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, నాయకులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : దుర్గాదేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చింది సూర్యాపేట సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు, ఉద్యాపన వ్రతం, రుద్రహోమం, చండీహోమం, గోపూజ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమలగిరి పాత గ్రామం, నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలో అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ శుక్రవారం పూజలు నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కోదాడ పట్టణంలోని నయానగర్ 13వ వార్డులో సుమారు 2000 మంది భక్తులకు అన్నదాతలుగా పాశం మదన్ మోహన్, లక్ష్మీ సామ్రాజ్యం, పాశం కృష్ణమోహన్, శ్రీ అపర్ణ దంపతులు వ్యవహరించి, అన్నదానాన్ని ప్రారంభించారు. హుజూర్‌నగర్ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి మెడలో కరెన్సీ నోట్లతో అలంకరించి కుంకుమపూజ నిర్వహించారు. మఠంపల్లి మండలం హనుమంతులగూడెం ఉత్సవ కమిటీ వారు దాతలు ఆధ్వర్యంలో రూ.1,85, 116 నోట్ల కట్టలతో ప్రత్యేక అలంకరణ చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల శ్రీ కనుకదుర్గ అమ్మవారు ధనలక్ష్మీ అలంకరణలో రూ.500,రూ. 200, రూ.100, రూ..50, రూ.20, రూ.10ల నోట్లతో సుమారు రూ.2లక్షలతో అలంకరించారు. పెదవీడులోని చింతలమ్మగూడెంలో 6వ రోజు అన్నదానం నిర్వహించారు. నేరేడుచర్ల విజయదుర్గా దేవాలయం, శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయంలో అమ్మవారిని మహాలక్ష్మి అలంకరించి పూజించారు. చిలుకూరు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని భక్తులు రూ.10లక్షల నోట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నేరేడుచర్లలో కుంకు పూజల్లో పాల్గొన్న మహిళలు

కాంగ్రెస్‌లో మదర్ డెయిరీ చిచ్చు

(5వపేజీ తరువాయి)

పార్టీ శ్రేణుల్లో తీవ్రంగా చర్చ మొదలైంది. తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థితో పొత్తు పెట్టుకునే అవకాశం ఎవరిచ్చారని, ఏఐసీసీ, టీపీసీసీ, ముఖ్యమంత్రి ఆదేశాలు ఉన్నాయా? అని నేరుగా ప్రశ్నించారు. కొంతమంది నేతలు తనను కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.ఈ ఎన్నికల్లో కొంతమంది జిల్లా నాయకులు బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నట్టు వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తన ప్రాతినిధ్యం లేకుండానే, ఇతర పార్టీలతో ఎలా లోపాయికారీగా బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతు ఇస్తారని అధిష్ఠానంతో ఎమ్మెల్యే చర్చించినట్టు సమాచారం. తన నియోజకవర్గంలో వేరేవారి పెత్తానం ఏంటని, తనను సంప్రదించకుండా పార్టీ నేతలు ఎలా నిర్ణయం తీసుకుంటారని, దీనిపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని ఆయన స్థానిక పార్టీ నేతలతో చర్చించినట్టు సమాచారం. ఎంతవరకైనా సరే ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి ఎలా మద్దతు తెలియజేస్తారో తెల్చుకుంటానని ఆయన సన్నిహితులతో వ్యాఖ్యానించినట్టు తెలిసింది. మదర్ డెయిరీ ఎన్నికల్లో జిల్లాలోని కొంతమంది కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్ పార్టీతో పొత్తుపెట్టుకుంటున్నారని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి లఫంగి రాజకీయాలు చేయొద్దని ఘాటుగా ఆరోపణలు చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిస్తే చరిత్ర హీనులవుతారని, పార్టీకి ద్రోహం, మోసం చేసిన వారిగా చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో మెత్తం 311 మంది పాల సంఘాల చైర్మన్లకు ఆలేరు నియోజకవర్గంలో 110 మంది ఉన్నారు. అయితే గెలుపోటములు బీర్ల అయిలయ్య చేతిలో ఉన్నాయని, పూర్తి బాధ్యత ఆయన తీసుకోవాలని సామేలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓటర్లు బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తున్నారని తెలిసినా, ఎమ్మెల్యే అయిలయ్య మౌనంగా ఉంటున్నారని, అదే జరిగితే రాజకీయ వ్యభిచారం చేసినట్టు అవుతుందని విమర్శించారు. డీసీసీ అధ్యక్షుడు, మదర్ డెయిరీ చైర్మన్‌కు బీఆర్‌ఎస్ నేతలతో బంధుత్వం ఉంటే వ్యక్తిగతంగా చూసుకోవాలని, బంధుత్వం కోసం కాంగ్రెస్ పార్టీని బొందపెట్టవద్దని హితవు పలికారు. మదర్ డెయిరీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిస్తే నైతికంగా బాధ్యత వహిస్తూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్‌గా ఉన్న ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీని బొందపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోతే కార్యకర్తలకు బుద్ధి చెబుతారని ఘాటుగా వ్యాఖ్యానించడం స్థానికంగా రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించాయి.